క్లుప్తంగా

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



బహుమతి అందజేస్తున్న హెచ్‌ఎం, సూపర్‌వైజర్

చెన్నూర్‌రూరల్‌: పోషణ మాసోత్సవం సందర్భంగా ఐసీడీఎస్‌ ఆధ్వర్యంలో పొక్కూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కిశోర బాలికలకు పౌష్టికాహారం గురించి తెలియజేశారు. పాఠశాల విద్యార్థులతో పోషణ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌ రజిత, హెచ్‌ఎం శ్రీనివాస్‌, అంగన్‌వాడీ టీచర్లు వసుమతి, విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆత్మహత్యల నివారణపై అవగాహన

మంచిర్యాలఅర్బన్‌: స్థానిక గర్మిళ్ల పాఠశాలలో శుక్రవారం ఆత్మహత్యల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యుడు సునీల్‌ ఆత్మహత్యల నివారణకు ఆలోచనలను ఏవిధంగా నియంత్రించుకోవడంపై వివరించారు. విద్యార్థులు మంచి అలవాట్లు అలవర్చుకోవాలని సూచించారు. హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, ప్రోగ్రాం కోఆర్డినేటర్‌ లింగారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో మాజీ ఎంపీ వివేక్‌

మందమర్రిరూరల్‌: పట్టణానికి చెందిన పలువురు యువకులు శుక్రవారం బీజేపీలో చేరారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాజీ ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు వివేక్‌ వారికి కాషాయ కండువా కప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. మాజీ ఎమ్మెల్యే సొత్కు సంజీవరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌, నాయకులు మల్లారెడ్డి, శ్రీనివాస్‌, దుర్గరాజ్‌, నరేశ్‌, రాయమల్లు, రమేశ్‌, సురేందర్‌ ఉన్నారు.

ఇంజినీర్లకు సన్మానం



సన్మానం పొందిన ఇంజినీర్లు

బెల్లంపల్లి: జాతీయ ఇంజినీర్స్‌ డే పురస్కరించుకుని బెల్లంపల్లి లయన్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కళాశాలలో ఇంజినీర్లను శుక్రవారం సన్మానించారు. ఇంజినీర్లు హరిత, సాంబయ్య, మధుకర్‌, కాటం శ్రీనివాస్‌, సందీప్‌, అశ్రితకు పూలమాల వేసి శాలువా కప్పి సత్కరించారు. లయన్స్‌ క్లబ్‌ అధ్యక్షుడు ఆర్‌.తిరుపతిరెడ్డి, సంయుక్త కార్యదర్శి కుక్కల నర్సయ్య, కోశాధికారి రాజన్న, సీనియర్‌ లయన్స్‌ క్లబ్‌ నిర్వాహకులు ఎస్‌.నర్సింగం, డి.నారాయణరావు, పి.రాజన్న, భాస్కర్‌, పాలిటెక్నిక్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బురద నీటిలో నిలబడి నిరసన

తాండూర్‌: దత్తత గ్రామాల్లో సమస్యలు తీర్చడంలో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తీవ్ర నిర్లక్ష్యం చేశారని బీజేపీ నాయకులు విమర్శించారు. కిష్టంపేట పంచాయతీలో శుక్రవారం పర్యటించిన కమలనాథులు స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్వయంగా పారిశుధ్య పనులు పరిశీలించారు. పంచాయతీలో రోడ్లు, మురుగుకాల్వలు సరిగా లేక రోడ్లపై బురద ఉండటంతో అందులో నిలబడి నిరసన తెలిపారు. నాయకులు విష్ణు కళ్యాణ్‌, శ్రీనివాస్‌, ప్రదీప్‌, భాస్కర్‌గౌడ్‌, విఘ్నేష్‌, శ్రవణ్‌, బాలు, శ్రీధర్‌, రవీందర్‌, మధు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణం అడ్డుకున్న సిబ్బంది

మందమర్రిరూరల్‌: మందమర్రి ఏరియాలోని మొదటి జోన్‌ రైల్వేస్టేషన్‌ రోడ్డులో పాత ఇల్లు కూలిపోగా నూతనంగా చేపట్టిన నిర్మాణాన్ని శుక్రవారం ఏరియా ఎస్టేట్స్‌, ఎస్‌అండ్‌పీసీ సిబ్బంది అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బాధితురాలు గోమాస లక్ష్మి మాట్లాడుతూ నాలుగైదు దశాబ్దాల క్రితం నిర్మించిన ఇల్లు ఆరునెలల క్రితం కూలిపోయిందన్నారు. కొత్త నిర్మాణం అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నా రాలేదన్నారు. కూలిపోయిన ఇంటి స్థలంలో నిర్మాణం చేపట్టగా సిబ్బంది అడ్డుకున్నారని రోదించింది. అనుమతి ఇవ్వకపోవడంతో నిర్మాణం చేపట్టానని తెలిపారు.

నిర్మించారు.. కూల్చేశారు



లక్ష్మి థియేటర్‌ చౌరస్తాలోని సర్కిల్‌ గోడలను తవ్వుతున్న కార్మికులు

మంచిర్యాలటౌన్‌: మున్సిపాలిటీ పరిధిలో నాలుగు చోట్ల ఏర్పాటు చేస్తున్న జంక్షన్ల నిర్మాణ పనులు మొదటి నుంచి వివాదాస్పదంగా మారాయి. రూ.4 కోట్ల నిధులతో చేపట్టే ఐబీ చౌరస్తా, వెంకటేశ్వర థియేటర్‌ చౌరస్తా, బెల్లంపల్లి చౌరస్తా, లక్ష్మి థియేటర్‌ చౌరస్తాలో జంక్షన్ల నిర్మాణ పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించారు. మూడు నెలల క్రితం సర్కిళ్ల గోడలను నిర్మించారు. కానీ ఇప్పుడు వాటిని కూల్చివేశారు. వీటిని ఎందుకు నిర్మించారో, ఎందుకు పగుల గొడుతున్నారో పట్టణ ప్రజలకు తెలియని పరిస్థితి. ఆ జంక్షన్ల నిర్మాణం డిజైన్‌ ఏర్పాటు చేసుకుని, ఆ తర్వాత మార్చుతూ కొన్ని నెలలుగా పనులు ఆలస్యం చేస్తున్నారు. దీంతో పట్టణ ప్రజలకు, జిల్లా కేంద్రానికి వచ్చే వారికి ఇబ్బందులను కలిగిస్తున్నారు. దీనిపై మున్సిపల్‌ ఇంజినీర్‌ మధుకర్‌ను వివరణ కోరగా, సర్కిళ్లలో చేపట్టే అభివృద్ధి పనులకు గాను రేలింగ్‌ ఏర్పాటు కోసం పనులు చేపట్టేందుకు నిర్మించిన వాటిని అవసరాన్ని బట్టి కూల్చివేస్తున్నట్లు తెలిపారు. నిధుల వృథాపై ఎలాంటి సమాధాన చెప్పకపోవడం గమనార్హం.

గణేశ్‌ మండపాలకు అనుమతి తీసుకోవాలి



మాట్లాడుతున్న బెల్లంపల్లి ఏసీపీ సదయ్య

మందమర్రిరూరల్‌: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గణేశ్‌ మండపాలకు అనుమతి తీసుకోవాలని బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలోని శ్రీ మంజునాథ గార్డెన్‌లో మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి, మున్సిపల్‌ కమిషనర్‌ గద్దె రాజు అధ్యక్షతన నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నిర్వాహకులు విద్యుత్‌ శాఖతో పాటు అన్ని అనుమతులు తీసుకోవాలని అన్నారు. మండపం వద్ద డీజే సౌండ్స్‌కు అనుమతి లేదన్నారు. ఎస్సైలు చంద్రకుమార్‌, రాజశేఖర్‌, గంగారం, వినాయక మండళ్ల కమిటీల సభ్యులు ఉన్నారు.

నెన్నెల: గణేశ్‌ మండపాలకు ముందుగా విద్యుత్‌ శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలని ఏఈ మల్లయ్య శుక్రవారం తెలిపారు. విద్యుత్‌ లోడ్‌కు అనుగుణంగా రుసుము చెల్లించాలన్నారు. 1000 వాట్స్‌ లోడ్‌ వరకు రూ.1560, 1000 నుంచి 1500 లోడ్‌కు రూ.2300, 1500 నుంచి 2000 వాట్స్‌ రూ.3020, 2000 వాట్స్‌ కన్నా ఎక్కువ లోడ్‌కు రూ.3020తోపాటు అదనంగా ప్రతి వెయ్యి వాట్స్‌కు రూ.1560 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

‘ఎమ్మెల్యే అసమర్థతతోనే అందని డబుల్‌’



ఇంటింటా ప్రచారం చేస్తున్న రఘునాథ్‌

మంచిర్యాలటౌన్‌: ఎమ్మెల్యే దివాకర్‌రావు అసమర్థతతోనే పేదలకు డబుల్‌ బెడ్రూం ఇళ్లు అందడం లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌ వెరబెల్లి అన్నారు. జిల్లాకేంద్రంలోని 8వ వార్డు పాత మంచిర్యాలలో శుక్రవారం ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే సొంత ఊరు, మున్సిపల్‌ చైర్మన్‌ ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డుల్లో సమస్యలకు నిలయంగా మారిందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వచ్చాక ప్రధానమంత్రి ఆవాస యోజన కింద అర్హులైన పేదలకు స్వంత ఇల్లు నిర్మిస్తామని తెలిపారు. నాయకులు మల్లేశ్‌, నరేందర్‌, మల్లేశ్‌, అశోక్‌, రాకేశ్‌ రెన్వా, చక్రి పాల్గొన్నారు.

కలెక్టరేట్‌ ముట్టడిని విజయవంతం చేయండి



పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న నాయకులు

నస్పూర్‌: ఈనెల 20న నిర్వహించే చలో కలెక్టరేట్‌ ముట్టడిని విజయవంతం చేయాలని మున్సిపల్‌ కాంట్రాక్ట్‌ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన కార్మికులతో కలిసి నస్పూర్‌ మున్సిపల్‌ కార్యాలయం ఆవరణలో చలో కలెక్టరేట్‌ వాల్‌ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్‌ కార్మికులను పర్మినెంట్‌ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, విధి నిర్వహణలో మరణించిన వారికి రూ.5 లక్షల ప్రమాద బీమా వర్తింపు, ఈపీఎఫ్‌, ఈఎస్‌ఐ వర్తింపజేయాలని డిమాండ్‌ చేశారు. జిల్లా అధ్యక్షుడు మాడుగుల నవీన్‌, జిల్లా ప్రధాన కార్యదర్శి కొయ్యల వెంకటి, ఉపాధ్యక్షుడు మద్దెర్ల సతీశ్‌, కోశాధికారి మాడుగుల రాజం, నాయకులు జబ్రీన్‌, అబిబ్‌, రాజేశ్వర్‌, సాగర్‌, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్‌ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న శ్రీధర్‌

మంచిర్యాలరూరల్‌(హాజీపూర్‌): సీజనల్‌ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని హెల్త్‌ ఎడ్యుకేటర్‌ అల్లాడి శ్రీనివాస్‌ అన్నారు. ముల్కల్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో సీజనల్‌ వ్యాధులపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమకాటుతో డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, ఫైలేరియా, మెదడువాపు వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందన్నారు. వ్యక్తిగత శుభ్రత, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంతోనే వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని అన్నారు. సబ్‌ యూనిట్‌ అధికారి నాందేవ్‌, సీహెచ్‌వో రామ్మూర్తి, పాఠశాల హెచ్‌ఎం వీరశంకర్‌, ఉపాధ్యాయులు రామకృష్ణ, జగన్‌మోహన్‌రావు, ఆరోగ్య పర్యవేక్షకులు పద్మ, ఏఎన్‌ఎం లక్ష్మి, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న జడ్జి అసదుల్లా షరీఫ్‌

లక్సెట్టిపేట: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని మున్సిఫ్‌ మెజిస్ట్రేట్‌ కోర్టు జూనియర్‌ సివిల్‌ జడ్జి మహ్మద్‌ అసదుల్లా షరీఫ్‌ అన్నారు. మండలంలోని జెండావెంకటాపూర్‌లో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, మహిళలు, విద్యార్థులు చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షులు కారుకూరి సురేందర్‌ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి



రిలే నిరాహారదీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్‌ నాయకులు

చెన్నూర్‌: కేంద్రం ఈనెల 18 నుంచి 22 వరకు నిర్వహించే ప్రత్యేక పార్లమెంట్‌ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి సుందిళ్ల మల్లేశ్‌ డిమాండ్‌ చేశారు. స్థానిక ఇంటిగ్రేటెడ్‌ మార్కెట్‌ ఎదుట శుక్రవారం నాయకులు రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వస్తే వందరోజుల్లో వర్గీకరణ బిల్లు పెడుతామని హామీ ఇచ్చి తొమిదేళ్లవుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఈ దీక్షలో ఎమ్మార్పీఎస్‌ నాయకులు శ్రీనివాస్‌, మల్లేశ్‌, నర్సయ్య, శ్రీనివాస్‌, రాము, సారంగం, జనార్దన్‌, శ్రీకాంత్‌, రాకేశ్‌ పాల్గొన్నారు.

● ఉత్తమ ప్రతిభ కనబర్చిన పాఠశాలల విద్యార్థులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్‌ శ్రీధర్‌, ఉపాధ్యాయులు



ప్రశంస పత్రాలతో చెన్నూర్‌లోని గురుకుల పాఠశాల విద్యార్థులు

మంచిర్యాలరూరల్‌(హాజీపూర్‌): గుడిపేట మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులు వివిధ క్రీడల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. లక్సెట్టిపేట గురుకుల పాఠశాలలో జిల్లా అథ్లెటిక్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఏ.ప్రేమ్‌కుమార్‌ షాట్‌పుట్‌, డిస్కస్‌ త్రో విభాగాల్లో ప్రథమ స్థానం, 1500 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ, జె.ప్రదీప్‌ 3000 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం సాధించాడు. ఎం.డీ.దానిష్‌ షాట్‌పుట్‌లో తృతీయ స్థానం సాధించాడు. ఈ ముగ్గురు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్‌ శ్రీధర్‌ తెలిపారు.

- అండర్‌–14, 16 విభాగాల్లో నిర్వహించిన క్రీడా పోటీల్లో గుడిపేట మౌంట్‌ కార్మల్‌ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. 800 మీటర్ల పరుగు పందెంలో డి.దీక్షిత ప్రథమ స్థానం, బి.సిరి ద్వితీయ స్థానం, 600 మీటర్ల పరుగు పందెంలో బి.సమన్విత తృతీయ స్థానం, 300 మీటర్ల పరుగు పందెంలో డి.దీక్షిత ద్వితీయ స్థానం సాధించి విజేతలుగా నిలిచారు. వీరిని హెచ్‌ఎం సిస్టర్‌ అల్ఫీ, పీఈటీ నరేందర్‌, ఉపాధ్యాయులు అభినందించారు.

క్రీడాపోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు

చెన్నూర్‌: పట్టణంలోని జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో సత్తాచాటారని ప్రిన్సిపాల్‌ కేవీఎం ప్రకాశ్‌రావు తెలిపారు. 14 ఏళ్లలోపు విభాగంలో 800 మీటర్ల పరుగు పందెం పోటీలో టి. ప్రశాంత్‌ (ప్రథమ), 2 కి.మీ పరుగుపందెంలో డి.రాహుల్‌ (ద్వితీయ), 17 ఏళ్లలోపు విభాగంలో లాంగ్‌జంప్‌లో మణికంఠ (తృతీయ), 600 మీటర్ల పరుగుపందెంలో రిషిత్‌ ద్వితీయ స్థానాల్లో నిలిచారు. పీఈటీ విజయ్‌, ఏటీపీ కృపసాగర్‌, వార్డెన్‌ జ్యోతి, నరేశ్‌లు వారిని అభినందించారు.

చెన్నూర్‌: ఓపెన్‌ కేటగిరీ విభాగంలో 400 మీటర్ల పరుగు పందెంలో పి.రాజశేఖర్‌, 1500 మీటర్ల పరుగు పందెంలో ఆర్‌.సాయివర్మ ప్రథమ స్థానంలో నిలిచారు. 18 ఏళ్లలోపు విభాగంలో 1500 మీటర్ల పరుగు పందెంలో ఏ.వినయ్‌ (ప్రథమ), 800, 3000 మీటర్ల పరుగు పందెంలో ఏ.కార్తీక్‌ ద్వితీయ స్థానంలో నిలిచారు. గురుకృప స్పోర్ట్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు కేవీఎం ప్రకాశ్‌, కార్యదర్శి రామయ్య, ఉపాధ్యక్షుడు పని రాజా, పీఈటీ దాసరి మల్లేశ్‌, కోచ్‌లు విద్యాసాగర్‌, సంతోష్‌లు వారిని అభినందించారు.

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని కాసిపేట సంక్షేమ బాలుర గురుకుల విద్యాలయం విద్యార్థులు క్రీడా పోటీల్లో జయకేతనం ఎగురవేశారు. అండర్‌–14, 16, 18, 20 విభాగాల్లో జరిగిన పోటీల్లో విద్యార్థులు ఐదు స్వర్ణ, 5 వెండి, మరో 3 కాంస్య పతకాలు సాధించి సత్తా చాటారు. వీరిని ప్రిన్సిపాల్‌ వూటూరి సంతోష్‌కుమార్‌, పీఈటీ, ఉపాధ్యాయులు అభినందించారు.

- అండర్‌–14 విభాగంలో జావెలిన్‌ త్రో, షాట్‌ పుట్‌ పోటీల్లో కె.సంకేత్‌ రెండు బంగారు పతకాలు సాధించారు. జావెలిన్‌ త్రో పోటీల్లో ప్రేమ్‌కుమార్‌ వెండి పతకం గెలుచుకున్నాడు.
- అండర్‌–16 విభాగంలో 2వేల మీటర్ల పరుగు పందెం పోటీల్లో వివేక్‌వర్ధన్‌ బంగారు పతకం గెలుచుకోగా, జావెలిన్‌ త్రోలో అజయ్‌ వెండి పతకం, చంద్రశేఖర్‌ అజాద్‌ కాంస్య పతకం, హైజంప్‌లో అనిల్‌ కాంస్య పతకం సాధించారు.
- అండర్‌–18 విభాగంలో లాంగ్‌ జంప్‌ పోటీల్లో సాయి కిరణ్‌ (వెండి),, 3వేల మీటర్ల పరుగు పందెం పోటీల్లో సాయికిరణ్‌(కాంస్య), షాట్‌ పుట్‌ త్రో పోటీల్లో ఆదర్శ్‌(వెండి) పథకాలు గెలుచుకున్నారు.
- అండర్‌–20 విభాగంలో జరిగిన 800 మీటర్ల పరుగు పందెం పోటీల్లో అరవింద్‌ (బంగారు), లాంగ్‌జంప్‌లో రవితేజ(బంగారు), 400 మీటర్ల పరుగు పందెం పోటీల్లో వెండి పతకాలు సాధించాడు.

జైపూర్‌: మండల కేంద్రంలోని గురుకుల కళాశాల విద్యార్థులు వరుస్‌ సందేశ్‌ పరుగు పందెంలో (సిల్వర్‌), హైజంప్‌లో కె.సాత్విక్‌ (గోల్డ్‌), 60మీటర్లలో (సిల్వర్‌), 600 మీటర్ల జావెలిన్‌ త్రోలో సాయిచంద్‌ (బ్రాంజ్‌), జావెలిన్‌ త్రోలో వి.సందీప్‌ (గోల్డ్‌ మెడల్‌) సాధించారు. అండర్‌–18లో ఎస్‌.కుమార్‌ (గోల్డ్‌ మెడల్‌), నరేశ్‌ 100మీటర్స్‌లో (బ్రాంజ్‌), రాహుల్‌ 1500మీటర్స్‌, 400 మీటర్స్‌ (సిల్వర్‌), లాంగ్‌జంప్‌లో (బ్రాంజ్‌), పాల్సాన్‌ 100, 1500మీటర్స్‌ లాంగ్‌జంప్‌లో (గోల్డ్‌) మెడల్స్‌ సాధించారు. ప్రిన్సిపాల్‌ బాలభాస్కర్‌, వైస్‌ ప్రిన్సిపాల్‌ లక్ష్మణ్‌రావు, ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఆర్డీవో రాములు

మంచిర్యాలఅగ్రికల్చర్‌: జిల్లాలోని ట్రాన్స్‌జెండర్లు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆర్డీవో రాములు సూచించారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో ట్రాన్స్‌జెండర్లతో సమావేశమై మాట్లాడారు. ఓటు హక్కు ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈనెల 19లోగా ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌జెండర్లు తమ సమస్యలు విన్నవించారు. ఆర్డీవో స్పందించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీఇచ్చారు. డిప్యూటీ తహసీల్దార్‌ సనత్‌ కుమార్‌, శ్రీహరి, జిల్లాలోని ట్రాన్స్‌జెండర్‌ కమ్యూనిటీ సభ్యులు 20 మంది వరకు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌నగర్‌ కాలనీలో..

జిల్లా కేంద్రంలో ఎన్టీఆర్‌నగర్‌ కాలనీలో ఇంటింటికి సర్వే, నూతన ఓటరు నమోదు నిర్వహించారు. పీవీటీజీ పిర్టకులర్‌ వనరుబులిటీ ట్రైబల్‌ గ్రూప్‌ గుర్తించి వందశాతం ఓటరు నమోదు చేయించారు. ఆర్డీవో రాములు, తహసీల్దార్‌ భోజన్న, కౌన్సిలర్‌ శ్వేత, ప్రకాశ్‌, బీఎల్‌వో రేణుక పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఎల్‌వోసీ అందజేత

లక్సెట్టిపేట: పట్టణానికి చెందిన నిరుపేద అయిన చిటిమల్ల కుమార్‌ భుజానికి గాయమైంది. అతని వైద్యఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి ఎమ్మెల్యే దివాకర్‌రావు రూ.లక్ష ఎల్‌వోసీని మంజూరు చేయించారు. మున్సిపల్‌ చైర్మన్‌ నల్మాసు కాంతయ్య శుక్రవారం బాధితుడికి అందజేశారు. ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు రమేశ్‌, శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

కోటపల్లి: అన్నారం గ్రామానికి చెందిన శృతికి రూ.లక్ష ఎల్‌వోసీ అందించినట్లు వైస్‌ ఎంపీపీ శ్రీనివాసరావు, జెడ్పీ కోఆప్షన్‌ సభ్యుడు అజ్గర్‌ తెలిపారు. ప్రభుత్వ విప్‌ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ సహకారంతోనే రూ.లక్ష ఎల్‌వోసీ అందించినట్లు పేర్కొన్నారు.

అభయ యాప్‌పై అవగాహన

తాండూర్‌: తాండూర్‌, మాదారం పోలీసుల ఆధ్వర్యంలో అభయ యాప్‌పై శుక్రవారం ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళల రక్షణ, రోడ్డు భద్రత గురించి పోలీసు శాఖ ప్రత్యేకంగా యాప్‌ను తయారు చేసిందని తెలిపారు. ఆటో డ్రైవర్లు యాప్‌ను వినియోగించి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానం చేర్చాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై అశోక్‌, పోలీసు సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

కోటపల్లి: టీజీబీ ఉదయ్‌కుమార్‌ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో ఆర్థిక అక్షరాస్యతపై కళాజాతబృందం అవగాహన కల్పించారు. ఫీల్డ్‌ ఆఫీసర్‌ అనిల్‌, కళాజాతబృందం విజయ్‌, విష్ణు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

ఐటీఐ ప్రవేశాలకు అవకాశం

మంచిర్యాలఅర్బన్‌: ప్రభుత్వ, ప్రైవేట్‌ ఐటీఐల్లో మిగిలిన సీట్లకోసం నాలుగవ దఫా అవకాశం కల్పిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్‌ చందర్‌ తెలిపారు. ఈనెల 20 వరకు అడ్మిషన్లకు చివరితేదీ ఉందని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

‘రెండు గిరిజన సంఘాల విలీనం అవాస్తవం’

మందమర్రిరూరల్‌: సింగరేణిలోని రెండు గిరిజన ఉద్యోగ సంఘాల విలీనం అవాస్తమని సింగరేణి గిరిజన ఉద్యోగుల ఉద్యోగుల సంక్షేమ సంఘం (330/2021)అధ్యక్షుడు బానోత్‌ కర్ణ, గౌరవ అధ్యక్షుడు గోల్ల రమేశ్‌ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మరో గిరిజన సంఘం (7856/2001) నాయకులు రెండు విలీనమయ్యాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారని వివరించారు.

చీరలు పంపిణీ

లక్సెట్టిపేట: మండలంలోని బలరావుపేట, జెండా వెంకటాపూర్‌, తలమల, తిమ్మాపూర్‌, లక్ష్మీపూర్‌, సూరారం, మిట్టపల్లి, అంకతిపల్లి గ్రామాల్లోని ప్రజలకు కొక్కిరాల రఘుపతి రావు చారిట్రబుల్‌ ట్రస్టు ఆధ్వర్యంలో కార్యదర్శి సురేఖ శుక్రవారం చీరలు పంపిణీ చేశారు. పింగిళి రమేష్‌, అన్నం మంగ, దేవేందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

జాతీయ నాయకుల చిత్రపటాలు అందజేత

చెన్నూర్‌: పట్టణంలోని నలగొండ పోచమ్మవాడ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 25 మంది విద్యార్థులకు సామాజిక సేవకుడు స్వర్గీయ బాలాజీ సత్యనారాయణ స్మారకార్థం ఆయన కుమారుడు రమేశ్‌ బాబు జాతీయ నాయకుల చిత్రపటాలు అందజేశారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం షాబీర్‌, ఉపాధ్యాయుడు ప్రసాద్‌ ఉన్నారు.

ఐఎఫ్‌టీయూలో చేరికలు

నస్పూర్‌: సింగరేణి సులభ్‌ వర్కర్లు పలువురు సింగరేణి సులభ్‌ వర్కర్స్‌ యూనియన్‌ (ఐఎఫ్‌టీయూ)లో చేరారు. శుక్రవారం శ్రీరాంపూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వారు చేరినట్లు యూనియన్‌ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం తెలిపారు.

కేజీబీవీలో వైద్యశిబిరం

కాసిపేట: మండల కేంద్రంలోని కేజీబీవీలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థినులకు వైద్యపరిక్షలు వైద్యసిబ్బంది నిర్వహించి మందులు పంపిణీ చేశారు. హోమియో వైద్యురాలు శ్రీదేవి, బెల్లంపల్లి ఆయుర్వేదిక్‌ వైద్యుడు సంజయ్‌ కుమార్‌, పాఠశాల ప్రత్యేకాధికారి సరిత, ఏఎన్‌ఎంలు జ్యోతి, రజని ఉన్నారు.

కౌన్సిలర్‌పై ఫిర్యాదు

నస్పూర్‌: పట్టణంలో 17వ వార్డు కౌన్సిలర్‌ దాసుపై అదే వార్డుకు చెందిన జె.నర్సింగ్‌ మున్సిపల్‌ కార్యాలయంలో శుక్రవారం ఫిర్యాదు చేశారు. నర్సింగ్‌ తెలిపిన వివరాలు.. హిమ్మత్‌నగర్‌ కాలనీలో ఇళ్ల వెనకాల రోడ్డు అవసరం లేని చోట రోడ్డు పనులు ప్రారంభించారన్నారు. రోడ్డులో తమ పట్టా భూమిని కొంత మేర కోల్పోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. అవసరం లేని చోట రోడ్డు వేసి ప్రజాధనాన్ని వృథా చేయడం సరికాదని తెలిపారు. రాజు, మల్లేశ్‌, రాజేశ్‌, కిరణ్‌, సత్యం పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

కాసిపేట: మండలంలోని దేవాపూర్‌కు చెందిన విజయలక్ష్మి స్వయం సహాయక సంఘంలోని సభ్యురాలు జుగ్నాక బొజ్జుబాయి మృతిచెందింది. ఆమె కుమారుడి మోతీరామ్‌కు యూనియన్‌ బ్యాంకు దేవాపూర్‌ ద్వారా రూ.2 లక్షల ప్రధానమంత్రి సురక్ష బీమా చెక్కును మేనేజర్‌ బాపు శుక్రవారం అందించారు. ఏపీఎం వెంకటేశ్వర్లు, గ్రామసంఘం అధ్యక్షురాలు కమల ఉన్నారు.

రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్టు భవన్‌లో శుక్రవారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్‌.వీరయ్య, జిల్లా కార్యదర్శి రవి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ప్రకాశ్‌, రంజిత్‌, శ్రీనివాస్‌, చందు పాల్గొన్నారు.

విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించాలి

దండేపల్లి: విశ్వకర్మ భగవాన్‌ జయంతిని ఈనెల 17న ఘనంగా జరుపుకోవాలని విశ్వబ్రాహ్మణ అర్చక పురోహిత్‌ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామానందస్వామి ఓ ప్రకటనలో సూచించారు.

ఆయుష్మాన్‌ భవపై శిక్షణ

దండేపల్లి: మండల పరిషత్‌ కార్యాలయంలో దండేపల్లి, తాళ్లపేట పీహెచ్‌సీల పరిధిలో పనిచేసే ఆశ కార్యకర్తలకు ఆయుష్మాన్‌ భవ కార్యక్రమంపై శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షకురాలు హెల్త్‌ సూపర్‌వైజర్‌ పుష్పవతి, వైద్యులు సతీశ్‌, క్రాంతికుమార్‌, హెల్త్‌ అసిస్టెంట్‌ రమణ, పవన్‌ పాల్గొన్నారు.

నోట్‌బుక్‌ల పంపిణీ

మంచిర్యాలటౌన్‌: మంచిర్యాల లయన్స్‌ క్లబ్‌ హైటెక్‌సిటీ ఆధ్వర్యంలో ఏసీసీలోని దత్తత ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం నోటు బుక్‌లు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. తిరుపతి, రామయ్య, రాంచందర్‌, హనుమంతరావు, విశ్వేశ్వర్‌రావు, రాజలింగు, విష్ణువర్ధన్‌, భూమ్‌రావు, పాఠశాల హెచ్‌ఎం ప్రకాశ్‌రావు పాల్గొన్నారు.

గోదావరి లిఫ్ట్‌ స్థలం పరిశీలన

జన్నారం: తిమ్మాపూర్‌ గ్రామంలోని గోదావరి లిఫ్ట్‌ ఇరిగేషన్‌ పనుల కోసం డీఈలు వెంకటేశం, విట్టల్‌, ఏఈలు అనిల్‌, రమేశ్‌ శుక్రవారం పరిశీలించారు. లిఫ్ట్‌ విషయమై సర్పంచ్‌ గంగాధర్‌, పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్‌ నేత దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆదేశాల మేరకు అధికారులు పర్యటించారు.

మహిళా భవన్‌కు భూమిపూజ

మందమర్రిరూరల్‌: మండలంలోని ఆదిల్‌పేట్‌లో శుక్రవారం సమ్మక్క–సారలమ్మ మహిళా భవన్‌కు ఎంపీపీ మంగ, జెడ్పీటీసీ రవి భూమిపూజ చేశారు. సర్పంచ్‌ సోదరి పున్నం, కోఆప్షన్‌ మెంబర్‌ నసీరొద్దీన్‌, పీఏసీఎస్‌ మెంబర్లు, వార్డు సభ్యులు ఉన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

నస్పూర్‌: శ్రీరాంపూర్‌ ఏరియాలోని ఆర్కే 7 గని ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని టీబీజీకేఎస్‌ ఏరియా ఉపాధ్యక్షుడు కె.సురేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆర్కే 7 గనిపై అలాయ్‌ బలాయ్‌ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నాయకులతో కలిసి ఉద్యోగుల సమస్యలు తెలుసుకున్నారు. ఆర్కే 7, 7ఏ గ్రూప్‌ ఏజెంట్‌ రాముడు, గని మేనేజర్‌ సాయి ప్రసాద్‌ దృష్టికి తీసుకెళ్లారు. జీఎం చర్చల ప్రతినిధులు కుమారస్వామి, లక్ష్మణ్‌, బ్రాంచి సెక్రెటరీలు భూపతి అశోక్‌, ఫిట్‌ సెక్రెటరీ వెంకటి ఉన్నారు.

అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు

బెల్లంపల్లి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు కాంగ్రెస్‌, బీజేపీ నాయకులు సంఘీభావం తెలిపారు. శుక్రవారం దీక్షా శిబిరాన్ని నాయకులు వేర్వేరుగా సందర్శించి మద్దతు ప్రకటించారు. కాంగ్రెస్‌ నాయకులు స్వామి, ఉదయ్‌కాంత్‌, మల్లేశ్‌, బీజేపీ నాయకులు ఏమాజీ, కేశవరెడ్డి, గోవర్ధన్‌, ప్రకాశ్‌, నవీన్‌, నర్సింగ్‌ ఉన్నారు.

కాసిపేట: మండల కేంద్రంలో అంగన్‌వాడీల సమ్మెకు కాంగ్రెస్‌ నాయకులు మద్దతు తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్‌ ఉన్నారు.

సన్మానం

దండేపల్లి: జిల్లా సమాఖ్య కార్యదర్శిగా ఎన్నికైన అల్లంల అనితను స్థానిక శ్రీలక్ష్మి మండల సమాఖ్య కార్యాలయంలో మణికంఠ వీవో ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. ఏపీఎం బ్రహ్మయ్య, సీసీ సురేందర్‌, వీవోఏ అనంతలక్ష్మి, వీవో లీడర్లు, సభ్యులు పాల్గొన్నారు.